

# ఉపసంహారము

"అవును నివ్వే... నివ్వే నిలబడు ఇయిగో ఫారాలు" అన్నారు రామిరెడ్డిగారు.

"నేనా? నేన్నిలబట్టవా... బలేవారే. చౌదరి గారి తరపున రాయబారవొచ్చానని తెలిసే తమరిలా చెబుతున్నారా? పరాచికం గాపోతే" అన్నాడు సుబ్బరాజు.

"పరాచికం గాదంటున్నాగదా. ఇన్ని పట్టొడుపులూ కిటుకులూ కీలకాలూ దెలిసినోడివి నివ్వుగాపోతే చవుదరా నిలబట్టం" అన్నారు రెడ్డిగారు పకపక నవ్వి.

"అయనకి మాటసాయం జేస్తామని మాటిచ్చాం. మన్ని నమ్ముకున్నాడు."

"బలేవోడివయ్యా. చౌదరి నిన్ను మాటసాయం అడిగింది నిజంగా మాటసాయం కోసవనా? అలాగయితే ఈ నెల్లాళ్ళూరుకునే వోడా... అసలు నువు ముందిజ్జెప్పు. నాకాడ నాటకాలాడతన్నావా? నిజంగానే ఆడిమాటనమ్మి వస్తన్నావా" అన్నారు రెడ్డిగారు.

సుబ్బరాజులో పౌరుషం తన్నుకొచ్చింది. అతని చూపు చర్రున తగిలింది రెడ్డిగారికి.

"కోపం జేసుకోమోక. పరాచికాని కన్నాను... నివ్వెక్కడ పోటీకొచ్చి గోదాలోకి దిగుతావోనని చౌదరే ఉపాయం జేశాడు. నిన్నే సాయంవడిగాడు నేనుదిక్కుండా. ఇంకెవడికి సాయం జేయకుండా నిన్ను నా మీదికి దోలాడు. ఇయ్యన్నీ నాకు తెలవ్వనుకున్నావా? అనాడే దెలుసు, అందికే ఈ యెత్తేసి కతజ్జెబతా కూర్చున్నాను. ఓయబ్బో ఎన్నెత్తులెయ్యుండే బతుకెళ్ళిందీ..." అన్నారు రెడ్డిగారు.

సుబ్బరాజు ఆలోచనలో పడ్డాడు.

"నిన్ను దగా తినిపించాలనుకున్నోడి కిచ్చినమాట గురించి ఇంత గుబులేటి. అందుకో ఫారాలు" అన్నారు రెడ్డిగారు.

సుబ్బరాజు ఆలోచన తెముల్చుకుని ఒక తీర్మానానికొచ్చాడు.

"నేను నిలబణ్ణు... నిలబళ్ళేను" అన్నాడు.

"అదేటంది? డబ్బా? డబ్బు గురించయితే..."

"కాదు మనసు... మనసు... రాకే"

"మద్దిన మనసేటి... మతిగినా పోయిందా..." అంటూ ఏదో అనుమానమొచ్చి "మజ్జిగనీళ్ళు దెప్పించనేటి" అన్నారు రెడ్డిగారు నవ్వుతూ.

సుబ్బరాజు సిగ్గుపడి నవ్వాడు.

"మా బలేవోరే, దాన్జోలికిబోను" అన్నాడు.

"యేవనుకోమాక. చనూకొద్దీ అన్నాగాని నీకు బయవేటి?"

"బయ్యంకాదు. బయంవూ కాదు అసయ్యంవూకాదు, దిగులు, గుబులు. ఈ యమాయక ప్రజల్ని చూసే – ఈళ్ళకాడోట్లు దీసుక పోయి ఏదో ఉద్దరిస్తాంవనడం దగా. అబద్దం. అందుకనందుకు మనసొప్పదు. పోనీ అటు చూదారా అంటే పాలిక్సంతా ఉట్టి మాయదారిగోల, పద్మవ్యూహంవంటారే అలాగుంది. అందులోకెల్తే ఇహ నదే పోత. అందులో కొట్టకలాడితే ఇక దేస్సేవ జేసేదేటి? అక్కడ నెగ్గలేను. ఈళ్ళకి దగా తినిపించలేను. నా వొల్లకాదు. తెలిస్తేల్సి నేన్నిలబణ్ణు బావో" అన్నాడు సుబ్బరాజు.

రామిరెడ్డిగారులేచి సుబ్బరాజు దగ్గరకు వచ్చి వీపు చరిచారు.

"అలాగంటే ఎలా. ఆళ్ళంతా దగా జేస్తన్నారని దెలిసి, అదేమో తప్పని దెలిసి నివ్వు మాటాడకూరుకుంటే అదిమాత్రం తప్పుగాదా? నీ పని నివ్వు జేసకపోవాల. ఫలితం వదిలెయ్. నివ్వొక్కడివే దేశాన్ని బాగుచేస్తానని ఎందుకనుకోవాలి. నీలాగెంతమందో యెలక్షన్లలో నిలబడి నెగ్గి నిర్వాకం చెయిగా చెయిగా ఎప్పటికో దేశం బాగుపడుద్ది. అసలు దాన్జోలికే పోనంటే ఎప్పటికీ బాగుపడదుగదా...(అంటూ నచ్చచెప్పడం ఆరంభించారు రెడ్డిగారు) అసలు పార్టిక్సంతా మాయదారిగోల అనుకోడం, అందరూ దగాకోర్లనుకోడం పొగరుమోత్తనం. మన పార్టిక్సులో స్వార్థం అనేది ఎప్పుడయ్యా వచ్చింది – నిన్నగాక మొన్నకదా. ఈ పదేళ్ళ అభివృద్ధికే నివ్వింత కంగారుపడి బెంబేలెత్తిపోతే ఎలా?"

రాజధానిలో అదేపనిగా గోతుల్దవ్వుతారనుకోకు. ఒక్కోసారికి ఒగ్రూపుకి శోషొచ్చేస్తది. ఒక్కోదఫా ఎవుడికీ తెలీకుండా అయికమత్యం వచ్చేస్తది. స్టేటిమెంట్లివ్వడానికి పాయింట్లుండవు. ఎత్తి పొడుపులి కెసులు బాటుండదు. అలాటప్పుడేం జేస్తారు? గవర్నమెంటు పని చూడకతప్పదు. ప్రజాసేవ అలాంటపుడే జరుగుద్ది. ఆ కాసేపూ చేసేదేనా సజావుగా జరగాలి గదా! అందాకా కొట్టుకులాడుతూ ఆలోచన లేకుండా వున్నందువల్ల సమస్యలెదురైనపుడు ఏదో వో తీర్మానం జేసెయ్యాలి. మాటవొరసకి విద్య వుందనుకో – అదేం బ్రహ్మవిద్యకాదు గదా. అందుకని దేశవంతా బళ్ళువేయించి అందరికీ బడిచెపితే యామయింది? బ్రిటీషోళ్ళు పెట్టిపోయిన గుమస్తా చదువు చదిగేసి ప్రెతోడూ ఉద్యోగవంటాడు. పొలం దున్నడం నామోషి. యాపారం చెయడం బయ్యం. అందుకే వొందరాళ్ళు చేతికొస్తాయి గదాని ఉద్యోగం కోసం బస్తీపరుగులు. చూశావా. విద్యా సమస్య అంటారే అది పరిష్కరించబోతే నిరుద్యోగసమస్య, దాన్నెంట బెట్టుకుని అవినీతి పన్లు – ఉన్నాడిని పీకించేసి ఇంకోడు దూరడం. ఉద్యోగాలమ్మడం, కొనడం, మావోడు, మాకులం, మీ కులం అని పీకులాడ్డం బయలుదేర్తయి. మద్య నిషేధవని పెడితే కాపుసారా, కామాపుసారా, దొంగరవాణా, కల్తీసరుకులు, హెచ్చు ధరలు ఇయ్యన్నీ వస్తన్నాయి. దొరల్దేశంలో ప్రొహిబిషను పెట్టబోయే వొరకు పెద్ద పెద్ద రాకెట్లు లేచాయి. దేవాంతకు ల్లేచారు. అరాచకం అయిపోయింది.

చివరికి మన కతెట్టా తయారయిందీ అంటే సారాయాపారం జేసేవోడే, మద్యనిషేధం వుండాలని వాదించే దాకా వచ్చింది. అదే నలుగురికీ లాభసాటి. మరి తాగేవోడి క్కూడా దొంగసారా రుచి ఎక్కువ.

అదిగో అటెంపు జూడు. నమ్మిన జనాన్ని తప్పుదారి పట్టించీ, చానాదూరం తీసుకు పోయాకా, తప్పనిదెలిసి నాలిక్కరుచుకుంటున్న నాయకులూ ప్రవక్తలూను, అళ్ళ సంగచ్చెప్పు. అళ్ళు తప్పని తెలీకనే తప్పుదారిన పట్టించారనుకో. ఇప్పుడు తెలిసినా పబ్లీకున తప్పొప్పుకుందుకు మనసొప్పదు. దేశం మంచికన్న, తమమాటే ముఖ్యమని అళ్ళ నమ్మకం... అలాటోళ్ళ నేంజేస్తావు... అదిగో అడచూడు. లంచాలమారి డిపార్టుమెంటు మధ్యనో మంచోడున్నాడు అడి కిష్టంలేదు గాని అడు తీసుకోపోతే కడవాళ్ళకందరికీ అవుమానం. లంచం దీసుకోపోతే బదిలీయో బర్తరఫో అవుద్ది. అలాటోడికి సాయం జెయ్యవూ? నీకు జాల్లేదూ? అదేటంతకన్న పెద్దయున్నాయి చూడు. మందు మాకులు మంచియొచ్చి మరణాల సంకెతగ్గడంతో జనాభా పెరిగిపోద్దని అరుగో అళ్ళకి బయం గామోసు. అందుకని మందుల్లో కల్తీ చేసేస్తున్నారు. అ కంపెనీలమీద చెయిజేసుకున్నోళ్ణే రెంకన్నకింద జమకడతారు. నివ్వు ఎర్రెంకన్నగా వుండకుండా పోటాడాలి.

అడుగో అ యమ్మెల్లేజూడు. అళ్ళూరు అవాడా ముఖ్యమా దేశమ్ముఖ్యమా అని తేలక గింజుకులాడుతున్నాడు. దేశవందరికోసం వోటేస్తే తనూళ్ళో అంతా తిట్టుకుంటారు. తనూరు కోసం అని చూసుకుంటే, పార్టీ వోళ్ళు మొట్టికాయ లేస్తారు. అలాటోళ్ళకి దారి చూపవూ? యెమ్మెల్యే అనేవోడు దేశాన్ని పాలించడంలో తనూరి తరపున పనిచేసేవోడా. కాకపోతే ఉత్తినే తనూరి తరపు వకీల్లాటోడా? సరుకు రవాణా సరిలేకపోతే పరిశ్రమలు, యాపారం అన్నీ దెబ్బతింటాయనీ గూడ్సు పెట్టెలకే ముందర యెక్కూవ డబ్బు కేటాయించి, ప్రయాణీకుల సదుపాయాలు తరలేస్తే నివ్వు జేసేది నిజమైన దేస్సేవ. కాని దాని విలవ ప్రజలందరికీ తెల్దుమరి. లేకపోయినా సరేనని దేస్సేవజేస్తావా? తరవాతేమైతే నాకేమని ప్రయాణీకుల వసతుల్జూసి పేరుదెచ్చుకుంటావా? ఈ సంగతి తేల్చి నాయకులకి చెప్పవూ? రాబడి పన్ను ఎగేసేవోళ్ళు ఎక్కువగా వున్నారని సర్కారోడు నివ్వు వొందంటే వెయ్యికి పన్ను కడతన్నాడు. అడలా చేస్తాడని, నివ్వు వెయ్యికి పన్ను కట్టదలిస్తే వందకే కడతానని పద్దు జూబిస్తున్నావు. అబద్ధాలాడకండా నివ్వు పద్దువేసి పన్ను కడతానంటే అరిపోతావు. అంచేత న్యాయంగా ఉంటానిక్కూడా అన్యాయంగానే నడుచుకోవాలి. వొజ్రాన్ని వొజ్రంతోనే కొయ్యాలన్నట్టు అన్యాయాన్ని అన్యాయంతోనే ఎదుర్కోవాలి. నివ్వింకో కొత్తదారి చూపించవూ? అదిగో అటుచూడు. తిమి, తిమింగిలం, తిమింగిల గిలం. చిన్ని చేపని పెద్ద చేప, దాన్నింకా పెద్ద చేప, దాన్ని చిన్న తిమింగిలం, దాన్ని పెద్ద తిమింగిలం మింగేస్తున్నాయి. ఈటిలో దేనిమీద జాలిపడతావు? దేన్ని జెయిల్లో వేస్తావు? వొర్కరు జీతం చాలదనేడస్తన్నాడు. కంపెనీవోడు లాబం చాలదంటన్నాడు. గవర్నమెంటోడు పన్నులు చాలటం లేదంటన్నాడు. నాగరీకం వొచ్చిందని పేరేగాని అడవిలో జంతువు పన్లే ఊళ్ళో మనంవూ చేస్తన్నా వింకా, మన మాట వినక తలొగ్గనోళ్ణే ఓడించడానికి చంపడం పూర్వకాలం పద్ధతయినా, ఈనాటికీ దాన్ని

మించిన సాధనం కనుక్కోనేలేదు. నివ్వు గోదాలో దిగి కనుక్కోరాదూ! జనం ఇంకా బయపడీ, ఆశపడీ, తికమకపడీ, మొహమాటపడీ, కంగారుపడీ ఓట్లేస్తున్నారని దేశాన్నీ, దేశాన్నేలే వాళ్ళనీ ఏలేవోళ్ళు ఎప్పటిమల్లేనే ఉన్నారనీ అంటున్నారు. నివ్వు గోదాలో దిగి సరుదుబాటు చెయ్యవూ? నూర్రూపాయల జీతగాడికి పదిరూపాయిలు పైందొరికితే అది పవుడర్లూ బైస్కోపులకి పోతూందిట. ఇబ్బందిబ్బందిలాగే ఉందంట. మనదేశం యెగుమతి దిగుమతి యాపారాల అంతరం కాస్త తగ్గి, ఎగుమతులు పెరిగితే, ఆ వారకి అమాం బాపతు ఖరుచులు సరుదుకుంటున్నాయిట. కష్టాలు కష్టాల్లాగానే ఉన్నాయంటున్నారు. ఇయ్యన్నీ సరుదుబాటు చెయ్యవూ? ఆ!..." అంటూ రెడ్డి గారు ఉపన్యాసం ముగించారు.

సుబ్బరాజు ఆయనకేసి చూసి విచిత్రంగా నవ్వాడు.

ఎలక్షనుకి నామినేషన్ ఫారాలందుకున్నాడు. అందుమీద రామిరెడ్డిగారి పేరు అభ్యర్థిగా వ్రాసి తాను ప్రతిపాదించాడు. "పంచాయితీ ప్రెసిడెంటుగారి క్కాబురంపండి" అంటూ ఫారాలాయనకిచ్చాడు.

రామిరెడ్డిగారు ఆశ్చర్యపడిపోయారు. సుబ్బరాజు రాయడం ఎపుడు నేర్చుకున్నాడని గాదు. దానిమీద రామిరెడ్డిగారి పేరు వేసి ప్రతిపాదించినందుకు.

"ఇదేటిది" అన్నారు.

"ఇదేటో మీకూ దెల్సు. నాకూ దెల్సు. మీరిచ్చిన వుపన్యాసం విన్న వోడెవడూ తెలిస్తెర్సి ఎలక్షనుకి దిగడు. నేను దిగాలన్న వ్యూహాతో మీరయ్యన్నీ చెప్పలేదు. పర్లేదు, మీర్నిలబడండి. నేను మాటసాయం జేస్తాను. పై సారికి మీమీదే పోటీకొస్తాలెండి. ఈ వ్యూహ ఇంకాస్తముందే చెదితే పోస్టర్లయ్యా రాయించేవోళ్ళంగా" అన్నాడు సుబ్బరాజు.

రామిరెడ్డిగారు పకపక నవ్వి, ప్రేమతో సుబ్బరాజు భుజం తట్టి, "ఒరేయ్ చింతాలూ, మద్దినాళ బండిమీద తెప్పించిన పోష్టరు కాయితాలు నా గదెనక నడవలో ఉన్నాయిగాని నాలుగిలా పట్రా" అని కేకవేశారు.

★ ★ ★